క్లుప్తంగా

తెనాలి అధ్యాపకుడికి పీహెచ్‌డీ



తెనాలి: పట్టణ అయితా నగర్‌కు చెందిన గొరిక పూడి సతీష్ వీఐటీ యూనివర్శిటీ పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసింది. కేఎల్ యూనివర్శిటీలో అధ్యాపకుడిగా పని చేస్తున్న సతీష్, 'డిజైన్ అండ్ డెవలప్‌మెం ఆఫ్ ఆప్టిమల్ క్లస్టరింగ్ అండ్ రూటింగ్ మెకానిజమ్స్ ఫర్ ఇంప్రూవింగ్ ఎనర్జీ ఎఫిషియన్సీ ఇన్ వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్' అనే అంశంపై పరిశోధన చేశారు. డాక్టర్ హరికిషన్ కొండవీటి గైడ్‌గా వ్యవహరించారు. సతీష్ సమర్పించిన సిద్ధాంత వ్యాసానికి వీఐటీ యూనివర్శిటీ పీహెచ్‌డీని బహూకరించినట్టు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా అయను పలువురు అభినందించారు.

అమర కళాకారుల సంస్మరణ

తెనాలి: మహిళలు బయటకు రాలేని పూర్వం రోజుల్లో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఎదిరించి, గ్రామగ్రామాన ప్రజాచైతన్య ప్రదర్శనలిచ్చిన వీరమాచినేని సరోజిని, తాపీ రాజమ్మ, సౌమిత్రి చిరస్మరణీయులని శనివారం సాయంత్రం జరిగిన అమరకళాకారుల సంస్మరణ సభలో పలువురు నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, అభ్యుదయ కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఇస్కఫ్ హాలులో ఏర్పాటైన సభకు సినీ డబ్బింగ్ కళాకారిణి వాల్మీకి విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. గాయని అనూరాధ, విద్యార్థి నేత మౌనిక, అన్నమాచార్య ప్రాజెక్ట్ గాయని వీణ, విజయదుర్గ, యోగ్న సహస్ర శ్రీరాం, చందు సూర్య, బొల్లిముంత కృష్ణ, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం సీజ్

తెనాలిరూరల్: అక్రమంగా రేషన్ బియ్యం తరలించేందుకు బస్తాలను నింపుతున్న మినీ లారీని పోలీసులు సీజ్ చేసి 59 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎండీయూ వాహనం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోగా, మినీ లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఉదయం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం వివరాలను సీఐ మల్లికార్జునరావు తెలియజేశారు. తెనాలి పట్టణంలోని రామలింగేశ్వర పేట తోటవారి వీధిలో అక్రమంగా రేషన్ బియ్యం రవాణా జరుగుతుండటంపై శనివారం తెల్లవారుజామున తమకు సమాచారం వచ్చినట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు. సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా కార్డు దారులకు ఇంటింటికీ వెళ్లి రేషన్ పంపిణీ చేసే వాహనం నుండి ఓ మినీ లారీలోకి పీడీఎస్ బియ్యం లోడ్ చేస్తుండటాన్ని గుర్తించి రేషన్ వాహనం డ్రైవర్ ప్రసాదం వెంకటకిషోర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. మినీలారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడని చెప్పారు. ప్రజలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని ఇవ్వకుండా వారికి డబ్బులు ఇచ్చి ఈ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని చెప్పారు. ఈ బియ్యం ఎక్కడకు తరలిస్తున్నారు? ఎవరి పాత్ర ఉంది? అన్న అంశాలు విచారణలో గుర్తిస్తామని సీఐ తెలిపారు.

మహిళా హక్కుల కోసం పోరాడిన సీతారామ్ ఏచూరి

సంతాప సభలో బాబూప్రసాద్

తెనాలి: సీపీఎం అఖిల భారత కార్యదర్శి సీతారామ్ ఏచూరి సంతాప సభను శనివారం ఇక్కడి చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో వర్కింగ్ విమెన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏవీఎన్ కుమారి అధ్యక్షతన ఏచూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు కె.బాబూప్రసాద్ మాట్లాడుతూ సీతారామ్ ఏచూరి దేశంలోని మహిళా కార్మికుల సమస్యలపై లోతైన అధ్యయనం చేశారని చెప్పారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, లింగ నిర్ధారణ పరీక్షలపై నిషేధం ఉన్నా, అమలు జరగటం లేదనీ, ఆడబిడ్డలను కనేందుకు జనం సిద్ధపడటం లేదని ఆయన చెప్పినట్టు గుర్తుచేశారు. సమాన పనికి సమానవేతనం అమలులేదనీ, విద్య, ఉపాధి, చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేయటం లేదని, మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఇంకా సాధించలేకపోయామని ఏచూరి వాపోయారని చెప్పారు.

స్కీం వర్కర్ల సమస్యలపై పోరాటాలు చేయాలనీ, అంగన్‌వాడి, ఆశా, మధ్యాహ్న భోజనం, నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేసే మహిళా కార్మికులకు కనీస వేతనాలు, ఇతరసౌకర్యాల కోసం కృషిచేయాలని సూచించేవారని చెప్పారు. బుద్దిస్ట్ సొసైటీ నాయకుడు వై.అశోక్, షేక్ హుస్సేన్‌వలి, షేక్ హసీనాబేగం, ఏవీఎన్ కుమారి, జి.లావణ్య, కె.రాధిక, చంద్రకళ, ఎన్.సుజాత, కె.కనకదుర్గ, షేక్ జరీనా బేగం, వి.పద్మావతి, పి.మరియమ్మ, బి.యామిని పాల్గొన్నారు.

అక్రమంగా తరలిపోతున్న ఇసుక!

- ముప్పంగి ఇసుక స్టాక్ యార్డ్ నుంచి రవాణా
- యథేచ్ఛగా ఇసుక దోపిడీ
- కూటమి నాయకులదే హవా!
- వల్లభాపురంలో రెండు ట్రాక్టర్లు జప్తు



వల్లభాపురంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొల్లిపర: మున్నంగి గ్రామంలోని కృష్ణానది కరకట్ట దిగువన మున్నంగి ఇసుక స్టాక్ యార్డులో ప్రభుత్వం అధికారుల సమక్షంలో జులై మొదటి వారంలో లక్షా 81 టన్నుల ఇసుక అమ్మకాలు ప్రారంభించారు. ఆగస్టు 20వ తారీకున స్టాక్ యార్డులో ఇసుక లేకపోవటంతో అధికారులు స్టాక్ యార్డులో ఇసుక అమ్మకాలు నిలిపివేశారు. ఈ క్రమంలో స్టాక్ యార్డు వద్ద ఇసుక తీయడానికి వీలు లేక కొంత అడుగున ఇసుక వదిలివేశారు.

అయితే కొన్నిరోజులుగా కృష్ణానదికి వరద రావటంతో నియోజకవర్గంలో ఇసుక డిమాండ్ పెరిగింది. దీంతో మండలంలోని మున్నంగి, వల్లభాపురం గ్రామాల్లో కూటమి నాయకులు, ఇసుక దళారులు గ్రామంలో నిల్వ ఉంచిన ఇసుక డంప్‌లు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు.

నాలుగు రోజుల క్రితం వరద ఉధృతి తగ్గటంతో మున్నంగి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద అప్పట్లో అధికారులు వదిలిన ఇసుకను కూడా నాయకులు రాత్రి సమయంలో ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారని పలువురు చెప్పడం విశేషం. ఇదే విషయమై పోలీసులకు సమాచారం అందడంతో ఈనెల 8వ తేదీ ఎస్ఐ పి. కోటేశ్వరరావు తన బృందంతో రాత్రి వేళ తనిఖీ చేయగా మున్నంగి వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లును పట్టుకుని కేసు నమోదు చేశారు. అయితే మళ్లీ శుక్రవారం రాత్రి వల్లభాపురంలో రెండు ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్న ఇసుకను పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

ఇప్పటికైనా కూటమి నాయకులు అక్రమ ఇసుక దందా ఆపితే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అనుమతులు లేకుండా తరలించవద్దు

ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తరలించటం నేరం. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మండలంలో ఎక్కడైనా ఇసుక, మట్టి తరలిస్తుంటే మాకు సమాచారం అందిస్తే వెంటనే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటాం.

–పి.కోటేశ్వరరావు, ఎస్ఐ

పద్మశాలి ఉద్యోగుల ఐక్యతే సమస్యలకు పరిష్కారం

- ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి
- ఘనంగా పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం



గంజి చిరంజీవిని సత్కరించిన అసోసియేషన్ నేతలు

తెనాలి: పద్మశాలి ఉద్యోగుల ఐక్యతే సమస్యలకు పరిష్కారమని ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి అభిప్రాయపడ్డారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తాను పూర్తి సహకారం అందిస్తానని చెప్పారు. పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ తృతీయ వార్షికోత్సవం శనివారం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జీవీఎస్ రామకృష్ణ అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వచ్చిన మార్పులకు అనుగుణంగా చేనేత రంగంలోనూ సాంకేతికతను అన్వయించుకుని కొత్త తరహా వస్త్రాలను ప్రజలకు అందించాలని సూచించారు. ఇందుకు అసోసియేషన్ చొరవ చూపితే చేనేతలకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. రాష్ట్ర పద్మశాలి సంఘం కన్వీనర్ జీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ మానవ సమాజానికి వస్త్రాన్ని అందించి, నాగరికతను నేర్పిన చేనేతలు సమాజంలో గుర్తింపును పొందారని గుర్తుచేశారు. చేనేతల జీవన స్థితిగతులు మెరుగుదలకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. తమిళనాడుకు చెందిన రాట్టై హాండ్ లూమ్స్ అధినేత కలైరసి, చేనేత పరిశ్రమలో ఇంజినీరింగ్ సాంకేతికతతో పరికరాలు, నూలు తయారీపై డిమాన్‌స్ట్రేషన్ ఇచ్చారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, కోశాధికారి టి.చంద్రశేఖర్, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, మహిళా విభాగం నేతలు, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. గత ఏడాదిలో రిటైరైన/పదోన్నతి/అవార్డులు పొందిన పద్మశాలి ఉద్యోగులను సత్కరించారు. 2023–24లో పదోతరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఆర్థికసహకారం అందజేశారు.

ప్రతి గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు అవసరం

విశ్రాంత ఐపీఎస్ అధికారి, మాజీ డీజీపీ మాలకొండయ్య



కొల్లిపరలో పంటపొలంలో గల సాయిల్ సెన్సార్ వద్ద మాజీ డీజీపీ మాలకొండయ్య

తెనాలి: ప్రతి గ్రామంలోనూ రైతులు కలిసి రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటుచేసుకుని ముందుకు వెళ్లాలని విశ్రాంత ఐపీఎస్ అధికారి, మాజీ డీజీపీ మాలకొండయ్య సూచించారు. మండల కేంద్రం కొల్లిపరలోని శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఆయన శనివారం సందర్శించారు. ప్రభుత్వ సహకారంతో నిర్మించుకున్న కలెక్షన్ సెంటర్, కోల్డ్ రూమ్, సోలార్ డ్రైయ్యర్, ప్రాసెసింగ్, ప్యాకింగ్ యూనిట్లను పరిశీలించారు. జర్మనీ సంస్థ 'న్యూ ఎరా' తోడ్పాటుతో పంటపొలాల్లో భూమి ఆరోగ్య పరిశీలనకు ఏర్పాటుచేసుకుని సాయిల్ సెన్సర్లను చూశారు. సెన్సర్ పనితీరును స్వయంగా పరిశీలించారు. ప్రకృతి విధానంలో సాగుచేస్తున్న పంటలను గురించి తెలుసుకున్నారు. అనంతరం కలెక్షన్ సెంటరులో ఏర్పాటైన సభలో రైతుల నుద్దేశించి మాట్లాడారు. రైతులు సంఘటితంగా వ్యవసాయం చేస్తే బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘం చూపిన బాటలో అన్ని గ్రామాల్లోనూ రైతులు సంఘాలుగా ఏర్పాటయితే బాగుంటుందన్నారు. సంఘం ఆధ్వర్యంలో గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ (జీఏపీ), ఆర్గానిక్ సర్టిఫికెట్లను రైతులకు అందజేస్తుండటం శుభపరిణామంగా చెప్పారు.

కార్యక్రమంలో విజ్ఞాన్ యూనివర్శిటీ అగ్రికల్చర్ కాలేజి డీన్ డాక్టర్ తాతినేని రమేష్‌బాబు, అసిస్టెంట్ డీన్ వై.వరప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.హరిష తదితరులు మాట్లాడారు. శ్రేష్ఠ సంఘం డైరెక్టర్లు నెర్ల కుటుంబరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొంతు గోపాలరెడ్డి, వుయ్యూరు సాంబిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మూగజీవాల సేవలో శ్రీశైల భక్తసేవా సమితి



పశుదాణా వాహనాన్ని తెనాలిలో జెండా ఊపి ప్రారంభించిన డీఎస్పీ బి.జనార్దనరావు



అన్నవరపులంకలో పశుదాణా పంపిణీ చేసిన ఎంపీడీవో వి.విజయలక్ష్మి



శ్రీశైల భక్త సేవాసమితి అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, సభ్యులు

- వరద బాధిత లంకగ్రామాల్లో పాడిపశువులకు దాణా పంపిణీ
- 400 మంది పాడిరైతులకు అందజేసిన సేవాసమితి

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీశైల భక్త సేవాసమితి స్వచ్ఛంద సేవాసంస్థ గత 18 ఏళ్లుగా పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో ఏటా మహాశివరాత్రి పండుగకు స్వామి దర్శనానికి వచ్చే భక్తులు దాదాపు 80 వేలమందికి ఉచిత ప్రసాద వితరణ చేస్తోంది. ఇటీవల కృష్ణానది వరద ప్రభావిత లంక గ్రామాల్లోని ప్రజలకు 10 వేల ప్యాకెట్ల బిర్యాని, పెరుగు అన్నం, మంచినీరు అందించింది. ఈ క్రమంలో మూగ జీవాలైన పాడిపశువుల ఆకలి తీర్చాలని కూడా భావించారు. అనుకున్నదే తడవుగా దాతల సహకారంతో 400 మంది పాడిరైతులను ఎంచుకున్నారు. ఒక్కో పాడిరైతుకు 25 కిలోల మినపపొట్టు, 25 కిలోల కామధేను మిక్చర్, రెండు కిలోల బెల్లం చొప్పున ప్యాకెట్లను తయారుచేసి లంక గ్రామాలకు తరలించారు. తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు శనివారం ఉదయం పశుదాణా వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. లంక గ్రామాలైన ఆవుల వారపాలెం, ఈపూరులంక, ములకపల్లి లంక, కొత్తూరులంక, అన్నవరపులంక, కనిగిరిలంక గ్రామాల్లో పంపిణీ చేశారు.

కొల్లిపర వండల గ్రామం అన్నవరపు లంక, కొత్తూరులంకలో పశుదాణాను ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీవో వి.విజయలక్ష్మి చేతులమీదుగా అందజేశారు. వరద బీభత్సానికి సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వంతోపాటు సేవా సంస్థలు, ట్రస్ట్‌లు తమవంతు సాయం చేసి ఆదుకోవాలని ఆమె కోరారు. శ్రీశైల భక్త సేవా సమితి, తెనాలి అధ్యక్షుడు ఆళ్ల వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ వరదల వంటి ప్రకృతి విపత్తు సమయాల్లో బాధితులను ఆదుకునేందుకు తమ సేవాసమితి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని చెప్పారు. పాడి రైతులు అధైర్యపడొద్దని చెప్పారు. సేవా సమితి సభ్యులకు గ్రామస్తులు తమవంతు కృతజ్ఞతలు తెలియజేశారు. సమితి సభ్యులు పరిమి గోవర్దన్, కోన బ్రహ్మానంద గుప్త, కొడాలి భారతి, వెంపటి రవీంద్ర, తుమ్మల రామకృష్ణ, నక్కా వేణుగోపాల్, బి.భాస్కరరావు పర్యవేక్షించారు.

తెనాలిలో కొనసాగుతున్న గణేష్ ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ రాధిక, యశోద కపూర్



రామలింగేశ్వరపేట గురవయ్య కాలనీలో గణేష్ పూజల్లో స్థానిక ముఖ్యులు



సంగంజాగర్లమూడిలో గణేష్ ఉత్సవాల్లో నిర్వాహకులు

తెనాలి: పట్టణ చినరావూరు రైల్వేస్టేషన్ సమీపంలోని కాలనీలో 12వ వార్డు కౌన్సిలర్ కొర్రా యశోద కపూర్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం జరిగిన పూజల్లో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. వీరితోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కౌన్సిలర్ కొర్ర యశోద కపూర్, భక్తులు ఉన్నారు.

రామలింగేశ్వరపేటలో...

పట్టణ రామలింగేశ్వరపేటలోని గురవయ్య కాలనీలో 16వ గణేష్ ఉత్సవాల్లో భాగంగా గత తొమ్మిదిరోజులుగా విశిష్టపూజలు, సాంస్కృతిక ప్రదర్శనలు కొనసాగాయి. శనివారం అన్నప్రసాద వితరణ చేశారు. నిర్వాహకుడు మట్టుపల్లి గోపాలకృష్ణ వితరణతో దాదాపు నాలుగు వేలమందికి అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం చందు చంద్రమౌళి సేవాకళాసంఘం ఆధ్వర్యంలో భజన పాటలు అలరించాయి. భజన మాస్టారు రెడ్డి ఉమామహేశ్వరరావు సారథ్యంలో ఎ.రమేష్, విజయ్, బైరాగి, మధుదేవి తదితరులు పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం నిమజ్జనం సందర్భంగా నగర సంచార మహోత్సవం చేపడుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ముందుగా లడ్డూ వేలంపాట ఉంటుందన్నారు. కార్యక్రమంలో మట్టుపల్లి గోపాలకృష్ణ, హరిదాసు గౌరీశంకర్, మామిడిపత్తుల సుబ్రమణ్యం, బండారు రవికాంత్, కఠారి హరీష్, కాకాని అన్వేష్, నాగేశ్వరరావు ప్రసాదు సాయి అలేఖ్య సాధన శ్రీదేవి మట్టపల్లి శ్రీనివాసు, అడపా సంపత్ పాల్గొన్నారు.

సంగంజాగర్లమూడిలో...

రూరల్ మండల గ్రామం సంగం జాగర్లమూడిలో శ్రీరామ మందిరంలో శ్రీరామ గణేష్ యూత్ ఆధ్వర్యంలో 40 గణపతి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం అన్నదానం చేశారు. వేలాది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆదివారం సాయత్రం ఆరు గంటలకు గణపతి నిమజ్జన ఊరేగింపు ఉంటుందని కమిటీ సభ్యులు తెలియజేశారు.

ఎరక్కపోయి.. ఇరుక్కుపోయి!



తెనాలి–రేపల్లె రైలు మార్గంలో తెనాలి వైకుంఠపురం వద్ద రైల్వే బ్రిడ్జి రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇనుప గడ్డర్‌కు పాల లారీ ఇరుక్కుపోయింది. పెదరావూరు వైపు నుంచి పాల లారీ తెనాలి వైపు వస్తుండగా, మార్గమధ్యలో వైకుంఠపురం వద్ద రైల్వే వంతెన ముందు ఏర్పాటు చేసిన గడ్డర్ లారీకి తగిలి ఇర్కుపోయింది. దీంతో తెనాలి–చందోలు రహదారిపై వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రైల్వే వంతెన కిందగా వాహన రాకపోకలు సాగించేందుకు రెండుదార్లు ఉన్నాయి. ఒకటి పల్లంగా ఉండి, తూర్పు కాల్వ నీటితో నిండిపోయి ఉంది. చిన్న కార్లు సైతం రాకపోకలు సాగించలేని పరిస్థితి. మరో మార్గంలో లారీ ఇరుక్కుపోయింది. గుంటూరు నుంచి రైల్వే సిబ్బంది గ్యాస్ కట్టర్లతో వచ్చి గడ్డర్‌ను క్రేన్ సాయంతో పైకి లేపి లారీని పంపారు.

–తెనాలి రూరల్

లోక్ అదాలత్ చక్కటి వేదిక



కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసులు

తెనాలిరూరల్: కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ చక్కటి వేదిక అని, తద్వారా కక్షిదారుల సమయం, ధనం ఆదా అవుతుందని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు చెప్పారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనలు మేరకు శనివారం స్థానిక న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు ఎం. శ్రీధర్, పవన్‌కుమార్, వివేక్ వర్ధన్, పి.రాజశేఖర్, మాట్లాడుతూ ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో చాలా వరకు కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారం అవుతాయని కానీ కక్షిదారులు అనవసరమైన భేషజాలకు వెళ్లి సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకుంటున్నారన్నారు. న్యాయస్థానంలో కేసులు జరిగితే ఎవరో ఒక్కరే విజయం సాధిస్తారని, అదే మధ్యవర్తిత్వం ద్వారా లోక్ అదాలత్‌లో రాజీపడితే ఇరుపక్షాలు విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో 57 సివిల్, 144 క్రిమినల్, 14 ప్రి లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయి. బాధితులకు రూ. 3,58,93,333 పరిహారం కింద అందించారు. లోక్ అదాలత్ మెంబర్లుగా ఎస్వీ మహేశ్వరరావు, సోలా శంకర్, శారదా, జి.వెంకయ్య వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ ఆత్మగౌరవ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



తెనాలిరూరల్: ఈ నెల 21న తెనాలి మార్కెట్ యార్డు ఆవరణలో మాదిగల ఆత్మీయ ఆత్మగౌరవ సమ్మేళనం కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాలు నిర్వహించనున్నాయి. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పాల్గొననున్న కార్యక్రమ పోస్టర్‌ను ఆహ్వాన కమిటీ, అనుబంధ సంఘాల నాయకులు శనివారం మార్కెట్ యార్డులో ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మాదిగలందరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కూచిపూడి సత్యం, వేమూరి సుధీర్, బోసుబాబు, ఆలపాటి కరుణ, తబిత, జ్యోతి, పులివర్తి లక్ష్మయ్య, మేకల సురేష్, యడ్లపల్లి అనిల్ కుమార్, సుద్దపల్లి మురళీధర్, షాలేమ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నిజాంపట్నం కాల్వలో మృతదేహం

తెనాలిరూరల్: మండలంలోని నందివెలుగు గ్రామం వద్ద నిజాంపట్నం కాల్వలో గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని పోలీసులు శనివారం గుర్తించారు. మృతదేహం గుర్తుపట్టేందుకు వీలులేకుండా ఉంది. ఇటీవల వరదల్లో మృతి చెంది పై నుంచి కొట్టుకువచ్చి ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.